# శిథిలాలు

చెరువుగట్టుకానుకుని వున్న ఆ మట్టిరోడ్డు మీదికి కారు మలుపు తిరగ్గానే నా గుండె ఉద్వేగంతో వేగంగా కొట్టుకోసాగింది. ఈ చెరువుగట్టు మీదా, కిందా నా బాల్యపు బుడిబుడి నడకలూ, పరుగులూ, గెంతులూ, ఆటలూ, అమ్మకు తెలీకుండా చెరువులో ఈతకొటట్టడం... తడిసిన తలా, ఒంటిమీది గౌనూ ఆరేదాకా యింటికి వెళ్ళకపోవడం, అంతసేపు యింటికి రాకుండా కంగారు పెట్టినందుకు దాదాపుగా ప్రతిరోజూ అమ్మచేత తన్నులు తినడం అమ్మమ్మ అడ్డురావడం, తాతయ్య అమ్మని కోప్పడ్డం అంతా పూర్వజన్మలోలా నా గుండె మాళిగలో నిక్షిప్తమైవున్నాయి.

కారు లక్షిందేవి మాను దాటుతుండగా, చప్పున గుండెల్లో నుండి గేలం వేసిలాగినట్లుగా దు:ఖం ఎగదన్నుకు వచ్చింది. ఈ వూళ్ళో లక్షిందేవి మానుకి ఓ పత్ర్యేకతుంది. ఆ చెట్టు ముందు నిల్చుని మనస్ఫూర్తిగా ఏ కోరిక కోరుకున్నా తప్పకుండా జరిగి తీరుతుందని వూరివాళ్ళ నమ్మిక. అమ్మమ్మ

ఈ లక్ష్మిందేవి చెట్టు గురించి తనకి కథలు కథలుగా చెప్పేది. ఈ వూరి ఆడపడుచు అత్తింట్లో కష్టాలు తట్టుకోలేక అర్ధరాత్రి ఒంటరిగా పుట్టిల్లు చేరితే పరువుకెరిచిన ఆ తండ్రి 'తన యింట్లోకి రావడానికి వీల్లేదనీ, తిరిగి అత్తింటికే వెళ్ళమనీ, భర్తతో కలిసి గౌరవంగా రమ్మనీ' శాసించాడట. ఆవిడ తిరిగి అత్తింటికి వెళ్ళడాని కిష్టపడక ఈ చెరువుగట్టు మీదకొచ్చి మానైపోయిందని అంతా చెప్పుకుంటూ వుండేవారు.

తనూ, చినమావయ్యా, గిరిజా, లలితా, రాజేశ్వరీ అంతా కలిసి ఈ చెట్టుకింద ఎన్ని మొక్కులు మొక్కుకున్నారు, ఎన్నెన్ని కోరికలు కోరుకున్నారు... 'ఏం కోరుకున్నావు మామయ్యా!' అంటే 'నువ్వు నా పెళ్ళానివి కావాలని' అని చినమామయ్య అమాయకంగా అన్నాడని తను సిగ్గుతో కూడిన కోపాన్ని ప్రదర్శిస్తూ మామయ్యాని యెంతెంత దూరం తరుముకుంది...చ్ ...

"అమ్మా... ఎటు?" డ్రైవరు పిలుపుతో వులిక్కిపడ్డాను.

అప్పటికే కారు చెరువుకట్ట రోడ్డు దాటి గుడివద్దకు చేరుకుంది. అక్కడినుండి నేరుగా ఒకదారి 'మాదిగాడ'లోకి, గుడికి ఎదురుగ్గా వున్న రోడ్డు వూర్లోకి దారితీస్తుంది. డ్రైవరుకి దారి చూపించి వెనక్కి జారగిలబడ్డాను.

గుడి నామరూపాలు లేకుండా శిథిలమైపోయి వుంది. ఈ గుడితో నా అనుబంధం చెప్పాల్సొస్తే చరిత్ర పాఠమవుతుంది. ప్రతి రాత్రి పనులయ్యాక ఊళ్ళో జనమంతా గుడివద్ద చేరి భజన కార్యక్రమం జరిపిం చేవారు.

'పాండురంగ విఠలా... పండరినాథ విఠలా' అంటూ హృదయరంజకంగా సాగే ఆ భజనకి యే ఒక్కరాత్రి మిస్సయ్యేవాళ్ళం కాదు నేనూ, చినమామయ్యా. భజన తర్వాత దొరికే గుగ్గిళ్ళ ప్రసాదం కోసం గుడ్డుకూరా, గడ్డపెరుగూతో బతిమాలి, బామాలి గోరుముద్దలు తిన్పించే అమ్మమ్మకి మస్కాకొట్టి, అందరికంటే ముందు లలితా, గిరిజలతో కలిసి గుడికి చేరుకునేవాళ్ళం. అయితే తిరిగి నేను యెలా యింటికి చేరుకునేదాన్నో గుర్తుండేది కాదు. మెలకువ వచ్చేసరికి అమ్మమ్మ పక్కలో వుండేదాన్ని. తాతయ్య స్వయంగా వచ్చి మామయ్య ఒడిలో తలపెట్టి నిద్రపోతున్న తనని భుజాన వేసుకుని తీసుకొచ్చేవాడని అమ్మ విసుక్కుంటే తప్ప అర్థమయేది కాదు.

గుడి పక్కగా వున్న బావి పూడ్చివేయబడి దాని స్థానంలో 'బోరు' బిగించబడి వుంది. ఆ 'బావి'ని అంతా 'గుడిబాయి' అని పిలిచేవాళ్ళు. అమ్మ గుడిబాయి నీళ్ళుతప్ప మరే యితర బావి నుండి నీళ్ళు తెచ్చినా తాగేది కాదు. అమ్మమ్మ ఈ విషయమై అమ్మని ఎప్పుడూ ముద్దు ముద్దుగా కసురుకుంటూ వుండేది. పనివాళ్ళు రానిరోజునయినా సరే చినతాతయ్యా వాళ్ళ సేద్యగాడితో ఒక బిందె గుడిబాయి నీళ్ళు తెప్పించేవాడు తాతయ్య కూతురి కోసం.

ముగ్గురన్నదమ్ముల నడుమ ముద్దుగా పుట్టిన అమ్మ ఆ రోజుల్లోనే రాకుమార్తెలా పెరిగింది. తన పదో ఏట 'వడ్డాణం' కావాలని మారాం చేసిందని తాతయ్య అప్పటికప్పుడు మద్రాసు వెళ్ళి చిన్ని వడ్డాణం చేయించి తీసుకొచ్చాడని వూరు వూరంతా విచిత్రపోయి వచ్చి

చూసెళ్ళిందట. కనిపించకుండా పోయిన 'గుడిబాయి'లాగే అతి చిన్నవయసులోనే అమ్మ కూడ వెళ్ళిపోయింది. అమ్మ ఆలోచనలతో నా గుండెల్లో నీళ్ళూరేయి.

ఆ వూరు వూరంతా మొత్తం కలిసి పొడవాటి ఆ వీధి ఒక్కటే. వెనుకగా కొన్ని యిళ్ళున్నా అవన్నీ దాదాపుగా పూరిళ్ళు. చెరువుకట్ట రోడ్డు నానుకుని వున్న ఈ శిథిల దేవాలయం వూరికి ఆరంభం అయితే ఈ వీధికి దాదాపుగా చివర వున్న 'ఇల్లు' అమ్మమ్మ వాళ్ళది. అమ్మమ్మ యింటికి యింకా కొంచెం చివరగా వున్న మిద్దె శ్రీరంగారెడ్డిది. రంగారెడ్డిగారమ్మాయి రాజేశ్వరి నాకత్యంత సన్నిహిత మిత్రురాలు. సెలవులొస్తాయంటే చాలు నాకోసం ఆతృతగా ఎదురు చూసేది. పూర్తయి వెళ్ళిపోతానంటే తన చిన్నిచిన్ని కళ్ళను చికిలించుకుంటూ కళ్ళనీళ్ళను దాచుకునేది. ఇప్పుడంతా ఎక్కడెక్కడున్నారో మరి? అమ్మమ్మ తన పెళ్ళికొచ్చినప్పుడు దొడ్లో రమ్మాయి 'శాంత' తిరుపతిలో వుందనీ, దాని మొగుడు యాక్సిడెంట్లో పోయాడనీ చెప్పింది.

ఇదిగో ఈ యిల్లు మిద్దింటోళ్ళ గిరిజది. వీళ్ళింటి పేరు పరిటాల అయినా అంతా వీళ్ళని మిద్దింటోళ్ళని పిలిచేవాళ్ళు. ఆ వూళ్ళో అప్పటికి యిదొక్కటే డాబా యిల్లట. అందుకే అంతా ఆ పేరుతో వ్యవహరించేవారని, అది అలా వాళ్ళింటి పేరుగా మిగిలిపోయిందనీ అమ్మమ్మ వివరించి చెప్పేది. ఇంటి నిండుగా మనుషులతో, యెప్పుడూ కొత్తగా వేయించబడిన రంగులతో మిలమిలా మెరిసిపోతూండే మిద్దిల్లు... వెలిసిపోయిన గోడలతో అక్కడక్కడ పాచిపట్టి, పగుళ్ళలో నుండి మొలచిన మర్రిచెట్లతో కేవలం పూర్వవైభవానికి ప్రతీకలా నిలిచి వుంది. పాత మిద్దింటి వైభవం మనోచిత్రం మీద నిలిచి గుండె కదిలినట్టయింది. అప్పటికే కారు మిద్దింటిని దాటిపోయింది.

ఒక్కరోజు... ఒక్కరోజంటే ఒక్కరోజు సెలవొస్తే చాలు ఆదివారం కలిసేలా నాలుగు రోజులు సెలవు పెట్టేసి అమ్మమ్మ వద్దకు పరిగెత్తుకొచ్చేదాన్ని... అన్నయ్య మాత్రం మేనత్త వద్దకి విజయవాడ వెళ్ళేవాడు. అప్పట్లో కార్లూ, బస్సులూ వూళ్ళోకి వచ్చేవి కావు. నెల్లూరులో బస్సెక్కి మద్రాసులో దిగి, అక్కడ బస్సు మారి కీళానూర్లో బస్సు దిగి కాలినడకన విష్ణువాక, పేరత్తూరు అన్నీ దాటుకుని వూళ్ళోకొచ్చేవాళ్ళం. నాన్న ఎప్పుడూ ఈ వూరికి వచ్చినట్లుగా తను చూళ్ళేదు. అమ్మ మాత్రం అప్పుడప్పుడూ వొచ్చేది. మిగిలిన సమయాల్లో పనివాళ్ళని పెట్టి నన్ను పంపించేవాళ్ళు.

చెరువు కట్ట దగ్గర్నుండే మొదలయ్యేవి పలకరింపులు.

ముసలాళ్ళు కళ్ళకు అరచేతిని అడ్డం వుంచుకుని

"ఎవురాయమ్మి? శ్యామలమ్మ కూతురు దానే?" అనేవాళ్ళు.

ఎప్పుడూ చంద్రశేఖరంగారమ్మాయిగా మాత్రమే వ్యవహరింపబడే నేను యిలా యిక్కడ మాత్రం శ్యామలమ్మ కూతురుగా పిలవబడ్డం చిత్రంగా, హృద్యంగా, యిష్టంగా తోచేది నాకు.

"ఎన్నమ్మా చిన్నమ్మా.... అమ్మా వర్లియా?" అంటూ పలకరించేవాళ్ళు పొలాల్లో పనిచేస్తున్న సేద్యగాళ్ళు.

తమిళనాడులోని మారుమూల వున్న ఆ చిన్న పల్లెటూళ్ళో అంతా మాట్లాడేది తెలుగే అయినా, పూర్తి అరవంలో కలగలిసిపోయిన తెలుగు. తమిళవాసన మిళితమైన ఆ తెలుగంటే ఎందుకో చెప్పలేను కానీ నా కెంతో యిష్టంగా వుంటుంది. ఇన్నాళ్ళ తర్వాత ఈ నేలనీ, ఈ వీధినీ, ఈ తెలుగునీ చూస్తుంటే అమ్మని చూసినట్లుగా, అమ్మని కౌగలించుకున్నంత ఆనందంగా వుంది నాకు.

నేనున్న బొంబాయి మహానగరంలో ఎన్నడయినా, ఎక్కడయినా అరవ వాసన తగిలినా, తమిళమాట విన్పించినా నా హృదయం వుప్పొంగిపోతుంది. అప్పుడప్పుడూ నేను తెలుగుదాన్నో, తమిళియన్నో అన్న అనుమానం కూడ కలుగుతుంటుంది నాకు.

బొంబాయి... బొంబే, ఢిల్లీ, కలకత్తా వంటి మహానగరాల్లో జీవించాలని, అటాచ్డ్ బాత్‌రూముల్లోనే స్నానం చేయాలనీ, ఆఫీసర్ భార్య హోదా వెలగబెట్టాలనీ, బంగళాల్లో నివసించాలనీ తను ఎన్నడూ కలలు గనలేదు.

తమ్ముడితో తన పెళ్ళి జరిపించాలని అమ్మకీ, తనని కోడల్ని చేసుకోవాలని అమ్మమ్మకీ చాలా కోరిగ్గా వుండేది. చినతాతయ్య తనని ఎప్పుడూ 'మనవరాలు కోడలా' అంటూ కలగలిపి ముద్దుగా పిలిచేవాడు.

అయితే 'మట్టి పిసుక్కునేవాడికి నా కూతుర్నిచ్చేది లేదని' నాన్న గట్టిగా చెప్పేశాడు. చినమామయ్య ఎక్కువగా చదువుకోలేదు. మట్టే తన సర్వస్వమని నమ్మిన తాతయ్యకి అసలైన వారసుడు చినమామయ్య.

ఈ మట్టి పిసుక్కోవడంలో వున్న ఆనందం, మట్టితోనూ, ఈ గొడ్లతోనూ చినమామయ్యకున్న అనుబంధం, ఆత్మీయత సూట్లు వేసుకునే వాళ్ళని మాత్రమే మనుషులుగా లెక్కించే నాన్నకి ఎన్నటికీ అర్థంకాదేమో. నేను పెద్దదాన్నయింది మొదలు నన్నీ వూరికే పంపించడం మానేశాడు నాన్న. శలవులొస్తే చాలు నా మనసు విలవిల్లాడిపోయేది .

అమ్మమ్మ, తాతయ్య ఎంత మొత్తుకున్నా వినకుండా నన్ను మా మేనత్త కొడుకు మధుకర్ కిచ్చి పెళ్ళి చేసేసి బొంబాయి పంపించి తేలిగ్గా వూపిరి పీల్చుకున్నాడు నాన్న. తన మొండితనంతో యింటిల్లిపాదినీ యువరాణిలా ఏలిన అమ్మ భర్త విషయంలో మాత్రం అసహాయురాలిగా, బేలగా చూస్తుండిపోయింది. ఆ దిగులుతోనే కృంగి, కృశించి నా పెళ్ళయిన ఆరునెలలకే అమ్మ వెళ్ళిపోయింది.

అమ్మ లేకపోవడం, అన్నయ్య రెండో మేనత్త కూతుర్ని పెళ్ళి చేసుకుని ఫారిన్ వెళ్ళిపోవడం, నాన్న దేశదిమ్మరిలా వూళ్ళు పట్టి తిరుగుతూండడంతో, నాకు ఆంధ్రప్రదేశ్‌కి వచ్చే అవసరమే లేకుండా పోయింది. ఒకటి , రెండుసార్లు అత్తగారింటికి వచ్చినా హైదరాబాదునుండి మద్రాసు వెళ్ళి అమ్మమ్మను చూసేందుకు వీలుపడింది కాదు.

అమ్మ మరణం తరువాత దాదాపుగా రెండు కుటుంబాల నడుమా సంబంధం తెగిపోయినట్లుగా అయింది.

"అమ్మా! వూరు దాటి వచ్చేశాం" చెప్పాడు డ్రైవరు ఆదుర్దాగా.

ఆలోచనా స్రవంతి నుండి చటుక్కున బయటపడి చుట్టూ చూశాను. శ్రీరంగారెడ్డిగారి యింటి బయటి అరుగులు కూలిపోయి... అవి తీసే వారి రాకకోసం ఆశగా ఎదురు చూస్తున్నాయి. ఇంటిగోడలు రంగులు వెలిసిపోయి కళతప్పి రాచరికాన్ని కోల్పోయిన రాచ కుటుంబంలా వుంది.

'ఏమిటిది? ఊరు ఊరంతా ఎందుకిలా శిథిలమైపోయింది? ఊర్లోని మనుషులంతా ఏమయిపోయారు? ఆ పలకరింపులేమయినాయి?' మనసులోనే తలపోస్తూ అమ్మమ్మ యిల్లు చూపించి కారాపమని డ్రైవరుతో చెప్పాను.

కారు శబ్దం వినగానే ఎదురింటి అంగడి మునెమ్మ తలెత్తి నాకేసి చూస్తూ గుండు కళ్ళద్దాలు సవరించుకుంది...

'ఈవిడ యింకా బతికేవుందా?' పలకరిద్దామనిపించి ఆ ఒక్కక్షణం ఆలస్యాన్ని కూడ సహించలేనట్లుగా, హేండ్‌బేగ్‌తోపాటు చినమామయ్య కిష్టమని కొన్న చిన్న ద్రాక్ష కవర్ని చేతిలోకి తీసుకుని గుండెల కానించుకుని, మెల్లిగా గేటు తీసుకుని లోపలికి అడుగుపెట్టాను. కాంపౌండు లోపలికి చూసి మరోసారి విస్తుపోవాల్సివచ్చింది నేను. నా చిన్నప్పుడు పచ్చని పర్షియన్ కార్పెట్లా రకరకాల మొక్కలతో నిండుగా నిండి వుండే ఆ పరిసరాలు పూర్తిగా ఎండిపోయి అక్కడక్కడా బండరాళ్ళు పోగయి వున్నాయి.

ఇంటికి ఆనుకుని వున్న పెద్దరుగునెక్కి పైనున్న వాకిలికి కట్టిన మైకుని అందుకోబోయి తాను కిందపడ్డం మామయ్యలూ, అమ్మమ్మ, తాతయ్యా నేను చనిపోయినంత ఎక్కువగా గాభరాపడ్డం నా మనో యవనిక మీద చిత్రమై నిల్చింది. వేసవిలో అమ్మమ్మ ఈ అరుగు మీద కూర్చునే పూలజడ వేసేది. అదీ ఈ దొడ్లో విరిసిన మల్లెమొగ్గలతో. మరి, యిదేమిటి? ఈ యిల్లూ... ఎవరో మెలి తిప్పినట్లుగా గుండెల్లోనుంచి దు:ఖం ఎగదన్నుకు వచ్చింది. జ్ఞాపకాలు గాయాలై నా గుండెల్ని సలపరిస్తున్నాయి.

"చిన్నీ... నువ్వా? ఇదేనా రావడం? ఒక్కదానివే వచ్చావా?" దాచుకుందామన్నా చిన మామయ్య ముఖంలో ఆనందం దాగడం లేదు. కన్నీళ్ళు అడ్డం పడుతోన్న గొంతుని గట్టిగా అదిమి

"లేదు మామయ్యా, ఇద్దరం వచ్చాం... మద్రాసులో ఆయనకేదో మీటింగుంటే...నన్ను కారిచ్చి పంపించారు..." చెప్పాన్నేను.

"రా...రా... సమయానికొచ్చావు... అమ్మ నిన్ను చూసిందంటే లేచి కూర్చుంటుంది..." అంటూ లోపలికి దారితీశాడు.

'అయితే అమ్మమ్మకు ఒంట్లో బాగోలేదన్నమాట' అనుకుంటూ ఒణుకుతున్న కాళ్ళతో లోనికి అడుగుపెట్టాను. అన్నీ సవ్యంగా వుండి అనుకున్నట్లుగా జరిగివున్నట్లయితే కుడికాలు పెట్టివుండేదాన్ని.

ఛ...ఛ.. .యిదేమిటి? యిలా ఆలోచిస్తున్నాను. నాకు పెళ్ళయింది. చినమామయ్య కూడ పెళ్ళయి హాయిగా కాపురం చేసుకుంటున్నాడు. ఇక యిటువంటి ఆలోచనలు కూడదు అనుకుంటూనే వెనుక నుండి మామయ్య కేసి చూశాను... మామయ్యలో ఇదివరకటి దారుఢ్యం లేదు. మనిషి బాగా కృంగిపోయినట్లుగా వున్నాడు. ఇదివరకటి రంగుకూడా లేదు. నల్లకప్పేసినట్టున్నాడు. ఆలోచనతోనే అమ్మమ్మ పడుకున్న నాలుగు తలుపుల యింట్లోకి అడుగుపెట్టాను.

మంచానికి కరచుకుపోయి వున్న ఆ శాల్తీ మహారాజ్ఞిలా ఈ యింటినంతటినీ శాసిస్తూండిన అమ్మమ్మ అనుకుంటే చినమామయ్యని చూసినప్పట్నుండీ అతి ప్రయత్నం మీద అదిమిపెట్టుకున్న దు:ఖం తన అవుట్‌లెట్‌ని వెతుక్కుంది. కల్హార సరస్సులయిన నా కళ్ళనీ, నన్ను కౌగిట్లో పొదివి పట్టుకుని లోలోపలే వెక్కుతున్న అమ్మమ్మనీ చూస్తూ భారంగా కుర్చీలో జారగిలబడి వెనక్కి వాలాడు చినమామయ్య.

ముగ్గురి గుండెలూ గుసగుసగా యెన్నెన్నో మాట్లాడుకుంటున్నాయి. మౌనం నుండి యిన్ని సంభాషణలు జరుపవచ్చని నాకు తెలీదు. నేను ఏడుస్తూనే వున్నాను. పదిహేనేళ్ళ నా హృదయభారాన్ని తీర్చుకోవడానికి యింకా, యింకా కొంచెంసేపు ఏడ్చివుందునేమో మనసారా... ఆ గర్జన విన్పించక పోయివున్నట్టయితే.

ప్రధానోపాధ్యాయుని అడుగుల చప్పుడు విని అల్లరిమానేసిన విద్యార్థిలా అమ్మమ్మ చప్పున ఏడుపాపేసింది.

"ఏమిటా ఏడుపులూ... పెడబొబ్బలూనూ... ఇప్పుడే శవం లేచినట్లుగా... ఇంకా టయిముందిలెండి.." అమ్మమ్మ కౌగిలి నుండి నన్ను నేను విడిపించుకోకుండానే దెబ్బతిన్నట్లుగా అటుకేసి చూశాను... చినమామయ్య భార్య అయివుండాలి.

పెద్దత్తలిద్దరూ తనకు బాగా తెలుసు. తన పెళ్ళయిన తరువాత రెండు మూడేళ్ళకి జరిగిన చినమామయ్య పెళ్ళికి మా ఆయన నన్ను పంపించనేలేదు.

ఆ గర్జన విన్న మామయ్య మెల్లిగా లేచి భారంగా అడుగులు వేసుకుంటూ బయటి కెళ్ళిపోయాడు.

"ఎవరావిడ?" చినమామయ్యని వెంటాడినట్లుగా వెళ్ళి ప్రశ్నిస్తోందామె. మామయ్య ఏం చెప్పాడో తనకి విన్పించలేదు. కానీ...

"ఓహో ఈవిడేనా? ఇప్పుడెందుకొచ్చినట్టో?" ఒక విధమైన అసూయ ఆ గొంతులో.

"అమ్మమ్మా" పిలిచాన్నేను.

"వూ" కల చెదిరిపోతుందేమోనన్నట్లు గాభరాగా నన్ను దగ్గరికి పొదుపుకుని మౌనంగా వుండిపోయిందామె.

"పెద్ద మామయ్య, శేఖరం మామయ్య, అత్తలూ అంతా ఏరి?" అంటూ ప్రశ్నించాను.

భారమైన నిట్టూర్పుతో ఒకింత లేచికూర్చుంది.

"వాళ్ళంతా యింకా యాడుండారమ్మా... ఎప్పుడో పట్నం పోయినారు. కడుపు చేత్తో పట్టుకుని... ఇదిగో ఈ ఎర్రిబాగులోడు మాత్రం యింకా ఈ యింటినీ, నన్నూ, ఈ వూరినీ వొదల్లేకుండా పాకులాడ్తుండాడు" చెప్పింది అమ్మమ్మ చిన్న కొడుకుని తలచుకుంటూ జాలిగా.

ఆమాటా, ఈమాటా...అమ్మమ్మ ఆరోగ్యం... మా ఆయన ఉద్యోగం, పిల్లల చదువులూ అన్ని విశేషాలూ ఒకరినొకరం పరామర్శించుకుంటూ... అరగంట గడిచేక.

"భోజనానికి లేవండి" పిల్చిందామె. ఈసారి యిదివరకటి గర్జింపులేదు. ఒకింత సౌమ్యంగా వుందామె గొంతు.

భోజనం చేస్తుండగా వచ్చాడు మామయ్య.

"ఇదిగో గడ్డపెరుగు... చిన్ని పెరుగులేందే అన్నం తినదు... మిద్దింటి శారదక్కనడిగి తెచ్చాను... వెయ్యి" అంటూ భార్య కందించాడు. అంతదాకా సరళంగా వున్న సుజాత ముఖం కందగడ్డయిపోయింది.

అలా ముఖం గంటు పెట్టుకునే నాకు పెరుగు వడ్డించింది.

నా భోజనమయ్యాక పైకి వెళ్ళిపోయాను అమ్మమ్మతో కొంచెంసేపు మాట్లాడి.

ఎప్పుడు నిద్రపట్టానో కానీ అయిదింటికి చినమామయ్య పిలుపుతో కానీ మెలకువ రాలేదు. మామయ్య చేతిలో కాఫీ కప్పు.

"అదేమిటి చినమామయ్యా? నువు తీసుకొచ్చేవు. నేనే వచ్చేదాన్నిగా..."

"ఫర్లేదులే... లేచి ముఖం కడుక్కుని కాఫీ తాగేయ్... కొంచెంసేపలా బయటికెళ్ళొద్దాం. మన పొలాలు యిప్పుడెలా వున్నాయో చూద్దువుగాని" చినమామయ్య భలే హుషారుగా వున్నాడు. మధ్యాహ్నం నేను చూసినప్పటి చినమామయ్యకీ, ఇప్పటికీ చాలా తేడా వుంది.

కాఫీ తాగుతూ చినమామయ్య కేసి చూశాను.

"లే మరీ" తొందరచేశాడు చినమామయ్య నన్ను.

"వద్దులే మామయ్యా... ఇక నేను బయల్దేరేస్తాను. ఆయన త్వరగా వచ్చేయమన్నారు. ఎదురుచూస్తుంటారు కూడ" చెప్పాను దిగులుగా.

"ఏంటి? అప్పుడేనా? నాలుగు రోజులుండవా?" దిగాలుగా ప్రశ్నించాడు మామయ్య.

"కుదరదు... రేపు రాత్రికే తిరుగు ప్రయాణం. అమ్మమ్మని చూడాలని పట్టుబడితే తప్పనిసరిగా పంపించారు... ఊ.. సుజాత ఏం చేస్తోందీ... అమ్మమ్మ లేచిందా?" మాటమారుస్తూ ప్రశ్నించాన్నేను.

"సుజాత లేదు... ఊరెళ్ళిపోయింది"

"అదేం?"

"అది తనకు అలవాటే. కోపమొచ్చినప్పుడల్లా అలా పుట్టింటికి వెళ్ళిపోతుంది. అమ్మ పోరుతో మళ్ళీ నేను వెళ్ళి బతిమాలి, బామాలి తీసుకొస్తే వస్తుంది" నవ్వుతూనే చెప్పాడు.

"ఇంతకీ ఏమిటి అసంతృప్తి? చినమామయ్య భార్య కూడ అసంతృప్తిగా వుంటుందా?" అన్నాను ఆశ్చర్యంగా. నా కళ్ళల్లో ఒకింత ఆరాధన కూడ తొంగిచూచి వుండొచ్చు.

"తృప్తీ అసంతృప్తీ అనేవి వాళ్ళ వాళ్ళ మనఃప్రవృత్తులను బట్టి వుంటాయి. చిన్నీ..." అంటూ రెండు మడత కుర్చీలు తీసికెళ్ళి ఆరుబయట వేశాడు మామయ్య. ఇద్దరం వెళ్ళి బాల్కనీలో కూర్చున్నాం.

ఆహారం కోసం బయటికెళ్ళి తిరిగి గూళ్ళకు చేరుకుంటున్న పక్షుల కిలకిలారావాలతో ఆ వేసవి సాయంత్రం ఆహ్లాదంగా వుంది.

మామయ్య కేసి తిరిగాను చెప్పమన్నట్లుగా.

"పెద్దన్న, శేఖరన్న టవున్లో కాపురాలు పెట్టారుగా. వాళ్ళేదో డబ్బుదోచుకుంటున్నారనీ, సుఖాలన్నీ బావుకుంటున్నారనీ సుజాత వుద్దేశ్యం. మనం కూడ టింగురంగా అంటూ టవున్లో కాపురం పెడదామంటుంది. మంచంలో వున్న అమ్మ తాలూకూ సేవలు చేయడానికి తను సుముఖంగా లేదు. పెద్దకోడళ్ళిద్దరికీ లేని బాధ్యత తనకు మాత్రమెందుకని లా పాయింట్లు తీస్తుంది. పెళ్ళాం, పిల్లల భవిష్యత్తునే ముఖ్యంగా ఎంచక తల్లికోసం పాకులాడే నాలాంటి చేతకాని వాడికి భార్యనయినందుకు పదే పదే చింతిస్తుంది. నీకు తెలీందేముంది? ఈ ఇంటినీ, ఈ నేలనీ, నాకీ జీవితాన్నిచ్చిన కన్నతల్లినీ యిప్పుడు శిథిలావస్థలో వున్నారు కదాని వదిలిపెట్టి వెళ్ళిపోయేంత మూర్ఖత్వం, స్వార్థం నాలో లేకపోవడం నిజంగా సుజాత దురదృష్టం....ప్చ్..." మామయ్య ఆగాడు..

నేను కల్పించుకున్నాను.

"పోనీ మామయ్యా... సుజాత కోరినట్లుగా అన్ని సౌకర్యాలూ, యిక్కడే, ఈ యింట్లోనే అమర్చుకోవచ్చుగా... అమ్మమ్మ అవసరాలకోసం ఒక మంచి పనిమనిషిని పెట్టుకోవచ్చు..."

నవ్వాడు మామయ్య చిన్నగా...ఆ నవ్వులో కోటి అర్థాలు తొంగిచూస్తున్నాయి. "నిజమే అమర్చుకోవచ్చు. బొంబాయి మహానగరంలో పదివేల జీతగాడి భార్యగా నీకవన్నీ చాలా తేలిగ్గా కన్పడొచ్చు. కానీ అవన్నీ అమర్చే స్థితిలో నేను లేను. ఆ స్థితి లేకే కదా చిన్నీ అన్నలంతా వలసపోయారు. ఈవూళ్ళో మగాళ్ళంతా ఎవరూ పొలంబోవటం లేదు. ఖాళీగా గోళ్ళు గిల్లు కుంటూ యింట్లో కూర్చుని వుంటున్నారు..." దీనంగా వుంది మామయ్య గొంతు.

"అదేం?" ఆశ్చర్యంగా ప్రశ్నించాన్నేను.

"చిట్టత్తూరు నీళ్ళు వచ్చినంతదాకా పొలాలన్నీ బాగా పండేవి చిన్నీ... నా చిన్నప్పుడు నాన్నతో కయ్యిల కాడికి పోతే పచ్చంగా... ఎంత అందంగా వుండేవనీ. ఒకపక్క ఏతకొచ్చిన నారుమళ్ళూ, నాటడానికి సిద్దంగా దున్ని పెట్టిన పొలాలూ... కయ్యిల నిండా ఆడా, మొగా కూలోళ్ళూ... ఎన్ని రోజులయినా అన్నం,నీళ్ళూ లేకుండా అక్కడే వుండిపోవాలన్పించేది. ఆ

దృశ్యం తలచుకుంటే యిప్పటికీ నాకు కడుపునిండిపోతుంది... ఏనాడైనా ఈ వూళ్ళో నీటియెద్దడి ఎరుగుదుమా... నీళ్ళులేక గొడ్లు చనిపోయిన మాటవిన్నామా... పశువులకి మేత లేక కసాయి వాళ్ళకి అమ్ముకున్న విశేషాలు జరిగాయా? పెద్దపెద్ద యిళ్ళనీ, వందల ఎకరాలనీ వదిలి కడుపు చేత్తో పట్టుకుని వూరోళ్ళంతా పట్నందారులు పట్టడం మనకు తెలుసా..." మామయ్య కళ్ళు చెమరించాయి.

"మరి చిట్టత్తూరు నీళ్ళు యిప్పుడు రావడంలేదా మామయ్యా?" చిన్నప్పుడు చిట్టత్తూరు నేల దగ్గర నేలబావిలో ఈతకొట్టే చినమామయ్యని గుర్తు చేసుకుంటూ ప్రశ్నించాను.

"లేదు చిన్నీ, ఆ వూరి సర్పంచ్ వెంకటరెడ్డి కేసుపెట్టి ఆ నీళ్ళతో మనూరికేమీ సంబంధం లేదని కోర్టులో వాదించి కింద నుండి పైదాకా చేతులు తడిపి మొత్తం నీళ్ళు తమ వూరికి పారేలా తీర్పు చెప్పించుకున్నాడు."

"అన్ని నీళ్ళు అతను మాత్రంమేం జేసుకుంటాడు?"

"వూరంతా సరిపోగా మిగిలిన నీళ్ళు సిటీకి అమ్ముకుంటున్నాడు. సిటీ బాగా పెరిగి పోతున్నట్టల్లా యెక్కడికక్కడ బోర్లు వేయడంతో సహజంగా ఈ నేలలో వున్న నీళ్ళు కూడ దాదాపుగా యింకిపోతున్నాయి. మన చిన్నప్పుడు అరవయి అడుగుల్లో పడే నీళ్ళు యిప్పుడు రెండు వందల అడుగుల లోతుకి పోయినా నీటి జాడ కన్పించడం లేదు...ఇదిగో యిటువంటి పరిస్థితుల్లో మగాళ్ళంతా యిదుగో యిలా... నాలాగే... అలా... అలా..." విషాదం నిండిన మామయ్య మొఖం చూడ్డానికి నాకు చాలా భయమేసింది.

చినమామయ్య ఎందుకిలా సగమైపోయాడో, ముఖం కళ తప్పిపోయిందో నాకు ఒకింత అవగాహనకొచ్చింది.

"నిజానికి సుజాతని కూడ తప్పు పట్టడానికి లేదు. తను పెరిగింది అటువంటి వాతావరణంలో, ఆర్భాటాలూ, ఆడంబరాలూ, శక్తికి మించి జీవించడం, అదే జీవితమని నమ్మడం తనకి అలవాటు. అటువంటి జీవితాన్ని యివ్వలేకపోయినందుకు నామీద అసంతృప్తి. దానికి తోడు... ఇటువంటి జీవితంలోకి మరో జీవిని ఆహ్వానించడం యిష్టంలేని నేను తనకి చెప్పకుండా వేసెక్టమీ చేయించుకు వచ్చానని నామీద కసి..."

"మామయ్యా...?"అన్నాను 'నిజమా?' అన్నట్టుగా.

అవునన్నట్టుగా తలూపాడు మామయ్య, కళ్ళు మూసి తెరుస్తూ.

నా గుండె గొంతుకలోకొచ్చినట్టుగా అయింది.చాలా సేపు నేను మాట్లాడలేకపోయాను. పది నిముషాలు మౌనం రాజ్యమేలాక "మామయ్యా మరి సుజాత అలా వెళ్ళిపోవడం నీకు బాధగా వుండదా?" వాతావరణాన్ని తేలికపరచడానికన్నట్లుగా టాపిక్ మార్చాను.

ఒక్క క్షణం మాట్లాడలేదు మామయ్య... ఆ తరువాత మెల్లగా చెప్పాడు.

"మామూలుగా అయితే బాధగానే వుంటుంది...ఈ రోజు మాత్రం లేదు..."

"ఎందుకని?"

"నీతో ఫ్రీగా మాట్లాడుకోవచ్చునని"

గొంతుకేదో అడ్డంపడ్డట్టుగా అయింది. భగవంతుడు ఎందుకిలా జీవితాలని మార్చి మార్చి కూరుస్తాడు.

చినమామయ్యవంటి గొప్పవ్యక్తితో జీవితం మూడుపువ్వులూ, ఆరుకాయలుగా మార్చుకోవచ్చు. అటువంటి చినమామయ్యతో సుజాతకి అసంతృప్తి... ఎప్పుడూ మౌనంగా వుండి 'అది కావాలి ఇది కావాలి'అంటూ పేచీపెట్టనని, జీవితంలో రాజీపడ్డట్లుగా వుంటాననీ నా పట్ల మా ఆయనికి అసంతృప్తి...

ఆయనకి తనంటే యిష్టమే...వయసుతో పాటు శరీరాన్ని పెరగనివ్వనందుకు... తననెప్పుడూ పొగుడుతుంటాడు. తనేది కోరినా తెచ్చివ్వగల స్థోమతా, మనసూ వుంది. అయితే నేను వేరెవరితోనూ మాట్టాడ్డం, సోషల్‌గా మూవ్ కావడం ఆయనకి యిష్టముండదు. చిన మామయ్యని గురించీ, అమ్మమ్మని గురించీ, ఎప్పుడైనా అమ్మని గురించీ మాట్లాడినా సహించ లేడు. చేదుగా మొహం పెడ్తాడు. పోనీకదాని శ్రీశ్రీ గురించో, చలాన్ని గురించో, మంచి సాహిత్యాన్ని గురించో మాట్లాడబోతే 'బోర్... బోర్' అంటూ అరిచి చెవులు మూసుకుంటాడు. పిల్లలకి ఆంగ్లభాష నేర్పుదామని వాళ్ళతో కంటిన్యువస్‌గా యింగ్లీషులో మాట్లాడితే ఓర్వలేడు. తెలుగు మీడియం డిగ్రీ తీసుకుని నక్కని తొక్కినట్లుగా బాంబేలో ఉద్యోగం సంపాదించిన అతడికి యింగ్లీషు భాషలో ఫ్లూయెన్సీ లేదు. తను ఎక్కువగా మాట్లాడ్డం అతడికిష్టంలేదు... అలాగని అసలు మాట్లాడకుండా వూరుకున్నా ఒప్పుకోడు.

మొత్తం మీద తనలోని విశ్వాసాన్ని, శక్తినీ గుర్తించి వాటిని అభివృద్ధిపరచుకుని తనను తాను వికసింపజేసుకునేటటువంటి స్త్రీల పట్ల చదువుకుని సూటుబూటు వేసుకుని ఆర్థికంగా ఉన్నత స్థితిలో వున్న తన భర్తకి ఎటువంటి సదభిప్రాయమూ లేదు. అసలు స్త్రీని ప్రాణమున్న వ్యక్తిగా కాక ఇంట్లోని మిగిలిన అన్ని విలాస వస్తువులతో సమానంగా చూసే భాగ్యశాలి...

ఏమిటో జీవితాలు ఎందుకిలా తారుమారవుతాయో మరి? ఎక్కడో ఏదో తేడా వున్నట్లుగా తోస్తోంది. ఆ తేడా ఏమిటో అర్థమయ్యీ, కానట్లుగా వుంది. నేనే అయితే అమ్మమ్మని ప్రాణంలా చూసుకుంటూ, ఈ యింటిని నందనవనం చేసి వుండేదాన్నా...? అమ్మమ్మ మీద నాకున్నంత ప్రేమాభిమానాలు పరాయి అమ్మాయి సుజాతకి వుండాలని కోరుకోవడంలో న్యాయముందా? ఏమిటీ ఎక్కడ తప్పటడుగు పడింది.

మామయ్యే నన్ను దగ్గరికి తీసుకున్నాడో, లేక నేనే కిందికి జారి మామయ్య ఒడిలో తలపెట్టుకున్నానో తెలీదు కానీ మరుక్షణంలో వెక్కివెక్కి ఏడవసాగాను. చినమామయ్య నా వీపుమీద చేయివేసి నిమురుతున్నడు ఓదార్పుగా.

ఆ స్పర్శలో ఎటువంటి ఉద్వేగమూ, ఆవేశమూలేవు. ఓ జ్ఞానవృద్ధుడు పసిపాపను లాలిస్తున్నట్లుగా, ఓదార్పు చెప్తున్నట్లుగా వుంది. ఆ స్పర్శలోని అనునయాన్ని వదులుకోవడానికి ఏమాత్రం యిష్టంలేని దానిలా చినమామయ్యకి మరింత దగ్గరగా జరిగాన్నేను.

మందాకిని, నవంబరు 1995